క్లుప్తంగా

బాధితుడికి వీరా పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

శింగనమల: మండలంలోని పి.జలాలపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామకృష్ణను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు పరామర్శించారు. బుధవారం ఆయన అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రామకృష్ణను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ భాస్కర్, మండల కన్వీనర్ అంకే నరేష్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రామాంజనేయులు, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: మునిసిపాలిటి పరిధిలోని చెట్నేపల్లె సెంటర్ 1, 2, 3 సీపీఐ కాలనీ, దాసరి కాలనీ, కోళ్ల ఫారం అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆయా కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ శర్మ , వసీం

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై పెట్రోల్ బంకు వద్ద బుధవారం జరిగిన రోడు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. పెద్దవడుగూరుకు చెందిన శ్రీనివాస్ శర్మ, వసీం పని మీద బైక్‌పై గుత్తికి బయలుదేరారు. అయితే పెట్రోల్ బంకు వద్ద బైక్‌ను లారీ ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాస్ శర్మ, వసీం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆవుల అపహరణ

గార్లదిన్నె: కల్లూరులో వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన రెండు ఆవులు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామస్తులు తెలి పిన వివరాలు.. గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు రెండు ఆవులను మొక్కుగా సమర్పించారు. అవి రోజూ గ్రామంలో సంచరించేవి. అలాగే ఆవులు ఇళ్ల వద్దకు రాగానే భక్తులు గోమాతలకు పూజలు చేసి దాణా పెట్టేవారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు రూ.1.50 లక్ష విలువ చేసే రెండు ఆవులను ఎత్తుకెళ్లారు. ఉదయం గ్రామంలో ఆవులు కనిపిం చకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉపాధి కూలీల హాజరు పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పెద్దవడుగూరు: మండలంలో ఉపాధి హామీ కూలీల హాజరు సంఖ్య పెంచాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఏపీఓ పుల్లారెడ్డి ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు దినసరి వేతనం రూ.300 వచ్చేలా పని చేయించాలన్నారు. పని ప్రదేశంలో సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని సూచించారు.

పుట్లూరు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీడీ వెంకటరత్నం సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు మస్టర్లను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆటలకు సై

- వేసవి సెలవుల్లో క్రీడల్లో మునిగిన యువత, విద్యార్థులు
- మైదానం బాట పడుతున్న వైనం

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ అన్ని విభాగాలోల క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు భారీగా బహుమతులను అందజేసి ప్రోత్సహించింది. దీనికితోడు క్రీడా సంఘాలు, దాతల చేయూతతో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మెరుస్తున్నారు. భారత మహిళల హాకీ జట్టులో ప్రస్తుతం ఆడుతున్న యతిమరుపు రజని, గతంలో నదీముద్దీన్‌లతో పాటు క్రికెట్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత, విద్యార్థులతో క్రీడామైదానాలు కళకళలాడుతున్నాయి. వేసవి సెలవులు కావడంతో యువత మైదానాల బాట పడుతున్నారు. ఎక్కడ ఖాళీ మైదానాలు కనపడితే చాలు అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. వీరికి తోడుగా వృద్ధులు, యువత సైతం వాకింగ్‌కు వెళ్తున్నారు. వీరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడాపరికరాల నుంచి షూలు, స్పోర్ట్స్ దుస్తులు అందుబాటులో ఉంచుతున్నారు. గతంతో పోల్చుకుంటే జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడా సామగ్రి విక్రయించే షాపుల సంఖ్య గణనీయంగా పెరిగింది.



దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా క్రీడాసామగ్రి

అందుబాటులో ఫిట్‌నెస్ పరికరాలు

శరీర ఆకృతిని పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్న యువతీ యువకులు జిమ్‌ల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. జిమ్‌కు వెళ్ల తీరికలేని వారు తమ ఇళ్ల, కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ సామగ్రిని అందుబాటులో ఉంచుకుంటున్నారు. వారికోసం మల్టీజిమ్ డంబెల్స్, షాట్‌పుట్, స్కిప్పింగ్ రోప్స్, రోలప్స్, వెయిట్ లిఫ్టింగ్ సెట్, రాడ్స్, బెంచ్ ప్రెస్, లెగ్‌ప్రెస్ పుల్లీస్, స్కిన్ అప్స్, అబ్‌డామినల్ బెంచ్స్ తదితర మల్టి జిమ్ సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నారు.

క్రీడాదుస్తులకు పెరిగిన డిమాండ్

జిల్లా వ్యాప్తంగా క్రీడా దుస్తులకు గణనీయమైన డిమాండ్ పెరిగింది. క్రీడాకారులు మాత్రమే కాకుండా క్రీడా సంఘాల ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, యువత, విద్యార్థులు సైతం క్రీడాదుస్తులను ధరిస్తుండడం వల్ల వీటి అమ్మకాలు బాగా పెరిగాయని యజమానులు చెబుతున్నారు. డాజల్, ఎస్ఎస్, రిబోక్, నైక్, పూమా, నివ్యా, స్పార్టన్, రక్షక్, శివనరేష్, స్పోర్ట్‌లుక్, తదితర కంపెనీల దుస్తులతో పాటు బ్రాండెడ్ స్పోర్ట్స్ షూలు, స్పైక్స్ అందుబాటులో ఉన్నాయి. నాణ్యతను బట్టి వీటి ధర రూ.100 నుంచి రూ.3 వేల వరకు లభిస్తున్నాయి.



మైదానంలో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

క్రీడలకు పెరిగిన క్రేజ్

దేశ వ్యాప్తంగా 11 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఐపీఎల్ ఒక ఊపు ఊపేస్తోంది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని బ్యాడ్మింటన్ లీగ్, హాకీ లీగ్, ఫుట్‌బాల్ లీగ్, ప్రో కబడ్డీ లీగ్, తాజాగా వాలీబాల్ లీగ్ యువత, క్రీడాకారుల్లో నూతనోత్సాహాన్ని తీసుకొచ్చింది. ఒకప్పుడు స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌కు వందలాది మంది హాజరైతే రెండేళ్ల నుంచి ఆ సంఖ్య జిల్లాలో వేలకు చేరిందంటే అతిశయోక్తి కాదు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుంది. ప్రధానంగా వారు ఎంచుకున్న క్రీడల్లో రాణిస్తే కెరీర్ పరంగా దూసుకుపోవచ్చు. ఇటీవల యువత, విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపుతున్నారు. ప్రధానంగా వేసవి సెలవుల నేపథ్యంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు.

– ఎస్.సాధిక్, క్రికెట్ కోచ్

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుంది. నేటి యువత, విద్యార్థులు తీవ్ర ఒత్తిడి వాతావరణంలో ఉంటున్నారు. అలాంటి వారికి క్రీడలు ఉపశమనం అందిస్తాయి. ఒత్తిడి నుంచి సులభంగా బయటపడొచ్చు.

– కె.శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి జయంత్యుత్సవం



గుత్తి: ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



గుంతకల్లు: లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరదేవి ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం నరసింహస్వామి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేదపండితులు, అర్చకులు వందలాది భక్తుల నడుమ శాస్త్రోక్తంగా హోమం చేపట్టారు. అనంతరం సుదర్శన చక్రానికి అభిషేకం నిర్వహించారు. మహామంగళ హారతి గావించి భక్తులకు అన్నదానం చేశారు. విజయవిట్టల భజన మండలి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరికృపాకర్, కోశాధికారి మేడా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో కొండపై వెలిసిన అతిపురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు.

కోనుప్పలపాడులో పోలీసు సోదాలు

యాడికి: మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో బుధవారం పోలీస్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యాడికి అప్ గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగార్జున మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. సెక్షన్ 144 అమలులో ఉండడం, కౌంటింగ్ వరకు జాగ్రత్తలు తీసుకొనే కార్యక్రమంలో భాగంగా అనుమానితులు, రికార్డులు లేని బైకులను స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం పోలీసులు గ్రామంలోని ఇళ్లు, పేడ దిబ్బలు, గడ్డి వాములను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు.

పెద్దపప్పూరు: ముచ్చుకోటలో బుధవారం అనుమానితుల నాయకుల ఇళ్లలో ఎస్ఐ శరత్ చంద్ర సిబ్బందితో సోదాలు నిర్వహించారు. జూన్ 4న ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా ముందస్తుగా సోదాలు నిర్వహించినట్లు పోలీసులు పేర్కొన్నారు.



కోనుప్పలపాడులో గడ్డి వాములు తనిఖీ చేస్తున్న పోలీసులు

వివాహిత ఆత్మహత్యాయత్నం

శెట్టూరు: మండల పరిధిలోని చెర్లోపల్లిలో బోయ సాకమ్మ అనే వివాహిత బుధవారం ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మాలేపల్లి గ్రామానికి చెందిన బోయ చిరంజీవితో పదేళ్ల క్రితం సాకమ్మకు వివాహం జరిగింది. కుటుంబంలో గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన సాకమ్మ పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

మార్మోగిన పెద్దమ్మ నామస్మరణ



అలంకరణలో పెద్దమ్మ తల్లి

కూడేరు: మండల పరిధిలోని ఇప్పేరు గ్రామంలో పెద్దమ్మ దేవి నామస్మరణ మార్మోగింది. బుధవారం పెద్దమ్మ దేవి ఊరు దేవరను గ్రామస్తులు కనుల పండువగా జరుపుకున్నారు. దేవరకు గ్రామస్తులు తమ బంధు,మిత్రులను ఆహ్వానించడంతో పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో ఇప్పేరు గ్రామం జనసంద్రమైంది. పెద్దమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు ఆశించిన స్థాయిలో పండి గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడు తల్లీ అంటూ అమ్మవారిని వేడుకున్నారు. జంతువును బలి ఇచ్చి మొక్కలు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శివరాముడు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన వేంకటరమణుడు



సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శమిచ్చిన ప్రసన్న వేంకటరమణుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన కలియుగ దైవం ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సూర్యప్రభ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీవారిని సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం బలిజ సంఘం ఆధ్వర్యంలో మేళతాళాలతో స్వామిని ఊరేగించారు. కోట, మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, పాతబస్టాండ్, లక్ష్మీ బజార్ మీదుగా కొనసాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి శేష వాహనోత్సవ కార్యక్రమం ఉంటుందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.



పురవీధుల్లో స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

ప్రజలందరూ సంయమనం పాటించాలి

పుట్లూరు: మండలవ్యాప్తంగా ఎన్నికల కౌంటింగ్ దృష్టిలో ఉంచుకుని 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచినా ప్రజలు సంయమనం పాటించాలని ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పాతపల్లి,లింగారెడ్డిపల్లి, యల్లనూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పల్లెల్లో ప్రతి చిన్న విషయానికి సమస్యలు సృష్టించరాదని, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉందని జనాలు గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. దేవుడి ఊరేగింపులు చేయరాదన్నారు. దేవుడి పూజా కార్యక్రమాలు గుడిలో చేసుకోవాలన్నారు. అనంతరం యల్లనూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి అన్ని రకాలు సేవలు ప్రజలకు త్వరితగతిన అందించాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీఓ నిర్వహించిన సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బోగాతి నారాయణరెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఎస్ఐ గిరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లింగారెడ్డిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేష్

పుట్లూరు: మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఉత్సవాలు, ఉరేగింపులు జరపరాదని ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని మడ్డిపల్లి, ఎల్లుట్ల గ్రామాల్లో పర్యటించిన ప్రజలకు పలు సూచనలు చేశారు. ఆలయాల్లోనే పూజలు నిర్వహించుకోవాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎస్ఐ హేమాద్రి తదితరులు ఉన్నారు.

ఓట్ల లెక్కింపు తర్వాతే బండిశిల తిరునాల

పామిడి: తాడిపత్రి ఎన్నికల అల్లర్ల దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు తర్వాతే బండిశిల తిరునాల నిర్వహించుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. రామరాజుపల్లిలో బుధవారం సాయంత్రం గ్రామపెద్దల ఆధ్వర్యంలో తిరునాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీఓ, సీఐతో పాటు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ హాజరయ్యారు. రామరాజుపల్లితో పాటు పెద్దవడుగూరు మండలం కాశేపల్లి, గుత్తి–అనంతపురం గ్రామాల ప్రజలతో సమీక్షించారు. గ్రామ సుభిక్షం కోసం ఏటా నిర్వహించే గ్రామదేవతల తిరునాలను యథావిధిగా జరుపుకోవడానికి అనుమతి ఇవ్వాలని ప్రజలు అధికారులను కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో తిరునాలను నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వలేమని అధికారులు తేల్చిచెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఈ విషయాన్ని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల ప్రజలకు తెలియజేశారు. దీంతో చేసేదేమి లేక ఆయా గ్రామాల ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగాతి మురళీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

పెద్దవడుగూరు : ఫర్టిలైజర్, సీడ్స్ షాపుల్లో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, పెద్దవడుగూరు ఏఓ మల్లీశ్వరి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు రికార్డులను పరిశీలించారు. విత్తనాలు విక్రయించే సమయంలో షాపుల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లైసెన్స్‌లు లేకుండా విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు ఆర్బీకేల ద్వారా విత్తనకాయలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కావాల్సిన విత్తనం అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు.



పెద్దవడుగూరులో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకట్రాముడు

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడి మృతి



నారాయణ స్వామి(ఫైల్)

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీకి చెందిన బక్కా నారాయణస్వామి(53)అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. నారాయణస్వామి ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పని చేసేవాడు. మూడు రోజుల క్రితం ఉన్న ఫలంగా కుప్పకూలి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు అనంతపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ సభ్యులు నారాయణ స్వామి మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

ఇద్దరు నేరస్తుల జిల్లా బహిష్కరణ

కంబదూరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఇద్దరిని జిల్లా నుంచి బహిష్కరించారు. గుండా గిరి, రౌడీయిజం చేస్తున్న ఎరుకుల ముత్యాలన్న (జోల్లోడు), ఎరుకుల రాజశేఖర్ (గుండబండ) అనే ఇద్దరు నేరస్తులను జిల్లా ఎస్పీ గౌతమిశాలి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో మూడు నెలల పాటు జిల్లా బహిష్కరణ చేశామని ఎస్ఐ ఆంజనేయులు బుధవారం విలేకరులకు తెలిపారు.

109 మంది బైండోవర్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్, టీడీపీకి చెందిన 109 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. బుధవారం ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 04న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు జరుగకుండా ముందస్తుగా రాజకీయ పార్టీ నాయకులను తహసీల్దార్ లోకేశ్వరీ ఎదుట బైండోవర్ చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనవసరంగా అల్లర్లుకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల, గరుగుచింతలపల్లి గ్రామాలకు చెందిన 20 మందిని బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. గ్రామాల్లో ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వారిని తహసీల్దార్ మల్లికార్జునస్వామి ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశామన్నారు.

ఎమ్మార్సీకి పాఠ్య పుస్తకాలు

పామిడి: పట్టణంలో ఎమ్మార్సీకి పాఠ్యపుస్తకాలు సరఫరా అయినట్లు ఎంఈఓ జయానాయక్ బుధవారం తెలిపారు. మండలవ్యాప్తంగా 1వ తరగతి నుంచి 10 వతరగతి వరకూ 46 పాఠశాలలు ఉన్నాయన్నారు. అందులోని మొత్తం 4363 మంది విద్యార్థులకు గాను 26,829 పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి బుధవారం తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పామిడికి రూ. 9 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

పామిడి: మండలానికి సంబంధించి 6,657 మంది రైతులకు సంబంధించి రూ.9,03,09,623 పంటనష్ట పరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి డీ లీనా వసుంధర బుధవారం తెలిపారు. ఇందులో ప్రధానంగా వేరుశనగ పంటకు సంబంధించి 1,712 మంది రైతులకు 1681.07 హెక్టార్లకు గాను రూ.17 వేల చొప్పున 2,85,78,258, పత్తి 2,461 మంది రైతులకు 2527 హెక్టార్లకు గాను రూ.17000 చొప్పున 4,29,69,935 చొప్పున పరిహారం మంజూరైందన్నారు. ఈ మొత్తం ఖరీఫ్‌లో పంటల సాగుకు రైతులకు ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం పరిశీలన

గార్లదిన్నె: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. బుధవారం గార్లదిన్నె గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను ఆమె పరిశీలించారు. అంతకు ముందు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు, నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. వేసవి శిక్షణా తరగతుల్లో పాల్గొనే విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

రథం పరిశీలన



పెన్నహోబిలంలో పాత రథాన్ని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ జేఈ కావ్య

ఉరవకొండ: పెన్నహోబిలంలోని లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవానికి ఉపయోగించే పాత రథాన్ని ఆర్‌అండ్‌బీ జేఈ కావ్య బుధవారం పరిశీలించారు. పాత రథానికి చేసిన మరమ్మతులను ఆలయ ఈఓ విజయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ సిబ్బందితో కలసి రథం కింది భాగం పటిష్టంగా ఉందా లేదా అని పరిశీలించారు. రథానికి మరమ్మతులు చేసిన ఆచారిను పిలిపించి చిన్న చిన్న మరమ్మతులు ఉంటే జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. అనంతరం జేఈ మాట్లాడుతూ.. రథం ట్రయిల్ రన్ విజయవంతం అయిందన్నారు. నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేస్తామన్నారు.